# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు

- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్
- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి రోడ్ షో
- గులాబీమయమైన నార్కట్‌పల్లి



నార్కట్‌పల్లి : రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పక్కన ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

నార్కట్‌పల్లి, అక్టోబర్ 20 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ రూపొందించిన మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగనుందని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నకిరేకల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్యతో కలిసి శుక్రవారం నార్కట్‌పల్లిలో భారీ రోడ్డు షో నిర్వహించారు. పట్టణంలోని మహిళలు కార్యకర్తలు ర్యాలీగా వచ్చి ఎమ్మెల్యేకు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అధికార దాహం తప్ప అభివృద్ధిపై ఎలాంటి ఎజెండా లేదని అన్నారు. నోరు తెరిస్తే అన్ని అబద్ధాల మాటలు 6 గ్యారెంటీలు అంటూ కొత్త ఎత్తు వేసుకొని వస్తున్నారని వారికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. నకిరేకల్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అది కేవలం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వల్లనే సాధ్యమైందని అన్నారు. చిరుమర్తి లింగయ్య ఎంతో మంచి సౌమ్యుడని ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి కనుక కారు గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## నార్కట్‌పల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా:

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ సెంట్రల్ లైటింగ్, డివైడర్ రూ.16 కోట్లతో పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ పనులు పూర్తయితే పట్టణ రూపురేఖలు మారిపోతాయన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు 100 శాతం పూర్తయ్యాయన్నారు. విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ చదివేందుకు ఎంతో ఇబ్బందులు పడొద్దని ఇంటర్ కళాశాల ఏర్పాటు చేశామని విద్యార్థుల సంఖ్యకూడా గణనీయంగా పెరిగిందన్నారు. అభివృద్ధి కోసమే పార్టీ మారాను తప్ప స్వలాభం కోసం కాదన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రారంభమైన బ్రాహ్మణవెల్లెంల, ఉదయ సముద్రం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే పూర్తి చేశామని అది తమ చిరకాల వాంఛ అన్నారు. కేసీఆర్ సహకరంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచానని ప్రజా సేవే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. సొంత మండలం వాడిని కనుక మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి తమను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, దుబ్బాక పావనీశ్రీధర్, పట్టణాధ్యక్షుడు దోసపాటి విష్ణు, కోఆప్షన్ సభ్యులు వాజిద్, మేడబోయిన శ్రీనివాస్, పుల్లెంల మహేశ్, వెంకట్,నాగరాజు, నడింపల్లి మహేశ్ పాల్గొన్నారు.

● నకిరేకల్ : నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని ప్రధాన రహదారి, కూడలిలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రచా రం నిర్వహించారు.



నార్కట్‌పల్లి ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

### ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి కృషి

నకిరేకల్ : ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నోముల గ్రామస్తులు నార్కట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే గుడి నిర్మాణంతో పాటు మరింత అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నోముల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు



రామన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న యాదాద్రి భువనగిరి అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు

రామన్నపేట, అక్టోబర్ 20: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు విషయంపై రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీఎస్‌ఓ శ్రీనివాస్, సివిల్ సప్లయ్ డీఎం గోపి, తాసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఏపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు



భీమారం సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

కేతేపల్లి, అక్టోబర్ 20 : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును చూసి పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయని మాజీ ఎంపీపీ, భీమారం సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గ్రామానికి చెందిన పలువురు విశ్వబ్రాహ్మణ కుటుంబాలు స్థానికుల ఒత్తిడితో నాలుగు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీలో ఉండలేక శుక్రవారం సర్పంచ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి వారిని ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.రాంబ్రహ్మం, కె.వీరయ్య, కె.వెంకన్న, కె.నారాయణ, వాసు, వెంకట నర్సయ్య, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చిముట వెంకన్నయాదవ్, నాయకులు జి.నాగరాజు, కోట ముత్తయ్య, సయ్య ఫరీద్, పాల్గొన్నారు.

## ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి సహకరించాలి




చిట్యాల : బూత్ స్థాయి అవగాహన సదస్సులో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చిట్యాల, అక్టోబర్ 20 : త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని తాసీల్దార్ దశరథ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన బూత్ స్థాయి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎలాంటి ఒత్తిళ్లకు గురి అవ్వకుండా ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గుండ్రాంపల్లి గ్రామాల్లో కూడ బూత్ లెవెల్ అవగాహన సదస్సును నిర్వహించారు.

### ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి : తాసీల్దార్ స్వప్న

కట్టంగూర్, అక్టోబర్ 20ః త్వరలో అసెంబ్లీ ఎన్నికలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని తాసీల్దార్ దొంకెన స్వప్న అన్నా రు. శుక్రవారం కట్టంగూర్ ఉన్నత పాఠశాల జరి గిన బూత్‌లెవల్ అధికారుల అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ పోరెళ్ల సునీత, ఎంపీఓ మహ్మద్ అథర్ పర్వేజ్, డీటీ సుకన్య, బూత్ లెవల్ అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కారు గుర్తుకు ఓటు వేసి చిరుమర్తిని గెలిపించండి

- నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్



నకిరేకల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు

నకిరేకల్, అక్టోబర్ 20 : త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. నకిరేకల్ పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నకిరేకల్ పట్టణంలో రూ.20 కోట్లతో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారని, రూ.26 కోట్లతో రోడ్డు విస్తరణపనులు, రోడ్డుకు ఇరువైపులా మురుగుకాల్వల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ నిర్మాణాలు, రూ.32 కోట్లతో వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను మరోసారి గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, కౌన్సిలర్లు రాచకొండ సునీల్, మట్టిపల్లి వీరు, చౌగోని సైదులు, చౌగోని లక్ష్మణ్, నాయకులు గుర్రం గణేశ్, ధైద పరమేశ్, రాచకొండ వెంకన్న పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- చిట్యాల మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చిట్యాల, అక్టోబర్ 20: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య గెలుపు కోసం కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిట్యాలలో శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ చిరుమర్తి లింగయ్య చేస్తున్న అభివృద్ధిని వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్‌లు కోనేటి కృష్ణ, బెల్లి సత్తయ్య, నాయకులు సిలివేరుశేఖర్, పందిరి రమేష్, జమాండ్ల శ్రీనివాసరెడ్డి, గోధుమగడ్డ జలంధర్‌రెడ్డి, ఎండీ షుకూర్, ఎండీ జమీరుద్దీన్, రుద్రవరం యాదయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి జిట్ట చంద్రకాంత్, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండె సైదులు, వరకాంతం రాజిరెడ్డి, శీలా సత్యనారాయణ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిక

యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వల్లమల్ల యాదగిరి, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు వెంకట్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## నేడు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రాక

శాలిగౌరారం, అక్టోబర్ 20 : మండల కేంద్రంలోని జీబీఎం ఫంక్షన్‌హాలో శనివారం నిర్వహించే బీఆర్ఎస్ మండల బూత్ కన్వీనర్ల సమావేశానికి తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ హాజరు కానున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అన్ని గ్రామాల బూత్ కన్వీనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.